

# అమెరి'కా'లేజ్

## - లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**"స్నానం చేసి** నీకొక సూపర్ డూపర్ పాలకూర వండుతాను" అంటూ బాత్‌రూంలోకి వెళ్ళాడు అన్నయ్య. వెంటనే కుక్కర్‌లో అన్నం పెట్టి లైబ్రరీనుండి తెచ్చిన నికొలస్ స్పార్క్స్ 'ది లకీ వన్' నవల తెరిచాను. ఐదు పేజీలు చదివాక కూడా ఎలిజబెత్‌ని ఎవరు చంపాలనుకుంటున్నారన్నదే నా మెదడులో తిరగడంతో ఈ పుస్తకాన్ని పక్కన పెట్టి బ్లడ్ లైన్‌ని తిరిగి తెరిచాను. ఇంతలో అన్నయ్య వచ్చాడు.

"నువ్వు పాలకూర తింటావుగా?" అనుమానంగా అడిగాడు.

"కాకరకాయ తప్ప ఏదైనా తింటాను."

"కాకరకాయకేం?"

"చేదు" మొహం చిట్లించాను.

"గింజలు తీసేస్తే చేదుండదు"

"అమ్మ ఎప్పుడూ అంతే చెప్పేది కానీ కూరమాత్రం కటిక చేదు."

"నీకు చేదు రాకుండా చేస్తాలే ఓసారి"

"అన్నయ్యా, నీకు వంట గురించి ఇంత ఎలా తెలుసు?"

"ఇండియానాకి వెళ్ళాక నీకే అర్థమౌతుందిలే" ఫ్రిడ్జ్ తలుపు తెరిచాడు.

"ఏమైనా హెల్ప్ చెయ్యనా?"

"అక్కర్లేదు. ఇది చాలా సింపుల్ కూర. పదిహేను నిమిషాల్లో అయిపోతుంది."

సోఫాలో కూర్చుని బ్లడ్ లైన్ చదవడం మొదలు పెట్టాను, కానీ అన్నయ్య కోప్పడకుండా రెండు పేజీలు చదవగానే పుస్తకం పక్కన పెట్టి టీవీ ఆన్ చేసాను. ఇంతలో 'వంట రెడీ' అన్నాడు అన్నయ్య. నిజంగానే పదిహేను నిమిషాలకన్నా ఎక్కువ పట్టలేదు.

"పచ్చడి తింటావా?" అడిగాడు.

"ఆఁ తింటాను. అమ్మమ్మ పెట్టిన పండు మిరపకాయ పచ్చడి తెరుద్దామా?"

"గుడ్ ఐడియా" స్పూన్ తెచ్చాడు.

గిన్నెలో చూస్తే అన్నయ్య వండిన పాలకూర కేవలం పాలకూరలానే ఉంది. గరిటెతో తిప్పితే కొన్ని ఎండు మిరపకాయలు, అక్కడక్కడ ఒక ఆవగింజ కనబడ్డాయి.

"అన్నయ్యా, ఇందులో కేవలం పాలకూర మాత్రమే ఉందా?" ఆశ్చర్యపోతూ అడిగాను.

"పాలకూర, ఎండుమిరపకాయలు, కరివేపాకు. ఇది చాలా హెల్తీ."

"ఉప్పుకారం కూడా లేవా?" బెదిరిపోయి అడిగాను.

"ఉప్పు వేసానే. మిరపకాయల కారం సరిపోతుంది" పెద్దగా నవ్వుతూ చెప్పాడు.

అన్నయ్య బాధపడతాడేమో అని కంచంలో కాస్త వడ్డించుకున్నాను. భయపడుతూనే అన్నం కలిపాను. ఒక ముద్ద చేతిలోకి తీసుకుని వాసన చూసాను. కరివేపాకు వల్ల ఆ ముద్ద నోటిని చేరింది. ఒక్క క్షణం మైమరచిపోయాను. అన్నయ్య చెప్పినట్టే ఎంతో రుచిగా ఉంది. మసాలాలు లేకుండా పాలకూర రుచి నోటికి తెలిసింది. జీలకర్ర అక్కడక్కడ పంటికింద నలిగి రుచిని పెంచింది. ఎండు మిరపకాయల నుండి వచ్చిన స్వచ్ఛమైన కారం. ఇంత రుచిగా పాలకూరని వండచ్చని నాకు అంతవరకు తెలీదు. రెండో ముద్ద కలుపుతూ "అన్నయ్యా రేపు కాకరకాయ కూరవండుతావా?" అడిగాను.

"పాలకూర తిన్నాక నా వంటమీద నమ్మకం కలిగిందా?" నవ్వాడు.

"ఔను. చాలా బావుంది"

"రేపు మనం షాపింగ్‌కి వెళ్ళాలి. ఎల్లుండి వండుతాలే"

"సరే" అన్నట్టు తలూపాను.

గిన్నెలోని కూరని సగంపైన నేను తిన్న తరవాతే అన్నయ్య కంచంలో అన్నంలేదని గమనించాను.

"అన్నం వడ్డించనా?" అడిగాను.

"ఒద్దు. నేను రాత్రిపూట అన్నం తగ్గించాను"

"అన్నంలేకుండా వట్టి కూరలు తింటావా? మరి పచ్చడి?"

"రాత్రిపూట కార్బ్స్ అవాయిడ్ చేస్తాను. పచ్చడి తినాలనిపిస్తే అన్నంలోనే కలుపుకుంటానులే" మళ్ళీ నవ్వాడు.

అమ్మమ్మ చేసిన పండుమిరపకాయ పచ్చడి వాసనకే నోరూరిపోయింది. వేడి వేడి అన్నంలో కలుపుతుంటే నెయ్యి ఒక్కటే తక్కువ. ఒక ముద్దని బాగా ఎర్రగా కలిపి నోట్లో పెట్టిన వెంటనే నా ప్రాణం లేచొచ్చింది. కమ్మగా, కారంగా, ఘాటుగా, అక్కడక్కడా కొన్ని ఆవాలు – అమ్మమ్మ అంత రుచిగా ఆ పచ్చడిని ఎవ్వరూ చెయ్యలేరు. ఎంత తిన్నా తనివి తీరని రుచి. భుక్తాయాసం వచ్చేవరకు తిని, అది తీరేదాకా అలానే కూర్చుండిపోయాను. అది గ్రహించడం వల్ల అన్నయ్య పదినిమిషాలు ఓపిక పట్టి "చెయ్యి ఎండిపోతుంది. లే ఇంక" అన్నాడు. కుంగ్ ఫూ పాండాలో పో లాగా భారీగా నడిచాను. నా సంగతి అర్థమై అన్నయ్యే టేబుల్ సర్దాడు. టీపాయ్ మీదే పుస్తకాలు ఉన్నాయి. బ్లడ్ లైన్‌లో దాదాపు వంద పేజీలు మిగిలాయి. కానీ ఆ పుస్తకాన్ని తీసుకోడానికి కూడా భుక్తాయాసం అడ్డుపడింది. ఎంతో కష్టపడి వంగి పుస్తకాన్ని మోసి పేజీని తెరిచినంతసేపు అన్నయ్య సినిమాలా చూసి, నా కళ్ళు చదవాల్సిన మొదటి పదాన్ని కనిపెట్టగానే "ఇప్పుడు తెరిస్తే రాత్రికి ఇంక పడుకోవు. బుక్ పక్కన పెట్టు" అన్నయ్య మందలించాడు.

ఎంత కష్టపడి పుస్తకాన్ని తెరిచానో అంత కోపంగా పక్కన పెట్టాను. ఇంకా నయం, అమ్మ మాట విని అన్నయ్య దగ్గర ఉండి చదువుకుంటే నా పని అయ్యేది. హాస్టల్‌లో వార్డన్‌లా అన్నయ్య నన్ను టార్చర్ చేసేవాడు. సినిమా చూస్తా అంటే కోప్పడొచ్చుకానీ పుస్తకం చదివితే తప్పేంటి? అయినా పొద్దున లేచేపని కూడా లేదు అని మనసులో తిట్టుకుంటుండగా,

"నువ్వు ఎప్పుడైనా పుత్తడిబొమ్మ సినిమా చూసావా?" అడిగాడు.

"లేదు" విసుక్కున్నాను.

ఏమీ మాట్లాడకుండా అన్నయ్య టీవీలో ఆ సినిమాని పెట్టాడు. ఎంత కోపంగా ఉండాలని ప్రయత్నించినా సుత్తి వీరభద్రరావు పాటలకి నవ్వాపుకోలేకపోయాను.

సినిమా పూర్తయ్యాక "పుత్తడి బొమ్మ అని పేరెందుకు పెట్టారో తెలుసా?" అన్నయ్య అడిగాడు.

"స్కూల్‌లో ఒక పోయెమ్ ఉండేది పుత్తడి బొమ్మ పూర్ణమ్మ అని. దాన్నించేమో?"

"ఔను" కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత "మనవాళ్ళు చాలా వెరైటీ" అన్నాడు.

"వెరైటీ అంటే?"

"అమ్మాయి ముసలాయన్ని పెళ్ళి చేసుకోవడం ఇష్టంలేక ఆత్మహత్య చేసుకుంటే పుత్తడిబొమ్మ బంగారు తల్లి, అయ్యో పాపం అంటారు. కానీ ముసలాయన్ని పెళ్ళి చేసుకోను అంటే మాత్రం పొగరు, వినయం లేదు, పెద్దలంటే గౌరవంలేదు అంటారు" దీర్ఘ ఆలోచనతో చెప్పాడు.

ఏం మాట్లాడాలో తెలియక "చనిపోతే సానుభూతి" అన్నాను.

నా మాటలు వినబడనట్టు " మన అమ్మ వాళ్ళు జెనరేషన్ అంతా అలానే పెరిగారు. అందుకే పిల్లల్ని అలా పెంచుతున్నారు"

"ఎలా?"

"పుష్పకి వచ్చిన పెళ్ళి సంబంధం ఇష్టంలేదంటే 'నీ మొహానికి ఇంతకన్నా మంచి సంబంధం రాదు' అని క్లర్క్‌కి ఇచ్చి పెళ్ళి చేసారు. పుష్పకి డిగ్రీలో గోల్డ్ మెడల్ వచ్చింది. పెళ్ళయ్యాక ఉద్యోగం చెయ్యడానికి ఒప్పుకోలేదు. బీద స్థితిలో ఉన్నారు. పోయినసారి నేను కలిసినప్పుడు పాపం ఏడ్చింది. సుజిత్ ఫిజిక్స్ చదివి సైంటిస్ట్ అవుతాను అంటే 'నీ కంత తెలివి లేదు. నువ్వు చదవలేవు నీ వల్లకాదు' అని మనసు విరిచేసారు. ఆ విషయంలో ఇప్పటికీ అసంతృప్తిగానే ఉన్నాడు. ఆఫీసు నుంచి ఇంటికి వచ్చాక భార్యని చాలా కసురుకుంటాడు. ఆ డిప్రెషన్ పోవడానికి రోజూ రాత్రిళ్ళు మందు అలవాటు చేసుకున్నాడు."

"ఇవన్నీ నాకు తెలియదు" బరువెక్కిన గుండెతో చెప్పాను.

"నువ్వు అప్పుడు చిన్నపిల్లవి. అందుకే నీకు గుర్తులేదు. పుష్ప పెళ్ళి గురించి చాలా పెద్ద చర్చే జరిగింది. పిన్ని ఇంకా అత్తయ్యా కలిసి బలవంతం చేసారు. నిజానికి వాళ్ళిద్దరికి తప్ప ఎవరికీ ఆ సంబంధం నచ్చలేదు."

కొన్ని క్షణాల నిశ్శబ్దం తరవాత "యింతకీ ఈ సంభాషణ ఎందుకు జరిగిందంటే, పుత్తడి బొమ్మ పూర్ణమ్మ వల్ల. అమ్మ వాళ్ళ చిన్నప్పుడు బాగా హిట్ అయిన పాట గుర్తొచ్చింది. అది పాడుకుంటూ ఎవరికి వాళ్ళు అదే కరెక్ట్ థింకింగ్ అనుకుంటూ పెరిగుంటారు. టెన్త్ ఫెయిల్ అయిన అమ్మాయిలకి అది వర్తిస్తుందేమో కానీ మన అమ్మలా డిగ్రీ చదివిన వాళ్ళకి కాదు. ఆగు నీకు వినిపిస్తా" ఫోన్‌లో పాట పెట్టాడు. మొదట్లో మ్యూజిక్ తెలియకపోయినా పాటని గుర్తుపట్టాను.

"ఇది నాకు తెలుసు కానీ మొత్తం ఎప్పుడూ వినలేదు" అన్నాను.

"ఇప్పుడు విను. నీకే తెలుస్తుంది."

మనసా తుళ్ళిపడకే, అతిగా ఆశ పడకే.... పల్లవి బానే ఉందిగా అనుకున్నాను. చరణం మొదలవ్వడంతో అన్నయ్య కామెంట్రీ కూడా మొదలైంది.

ఏమంత అందాలు కలవని వస్తాడు నిన్ను వలచి" అందరూ ఐశ్వర్యరాయ్‌లు కాదు. అందరూ నాగార్జున, చిరంజీవిలు కూడా కాదు"

ఏమంత సిరి ఉంది నీకని మురిసేను నిన్ను తలచి "అప్పుడు గోల్డ్ డిగ్గర్ అవుతాడు"

చదువా, పదవా, ఏముంది నీకు? తళుకు, కులుకు ఏదమ్మా నీకు? "షారూక్ ఖాన్, సచిన్ టెండూల్కర్ కావాలంటే మాత్రమే ఇది వర్తిస్తుంది. తన స్థాయికి తగ్గవాళ్ళకి కాదు. ఇలాంటి మెంటాలిటీ బలపడడం వల్లే పిల్లలకి అదే నేర్పుతున్నారు. 'నీ కనవసరం, నీ వల్లకాదు, నీకు అక్కర్లేదు' అంటూ బాగా కోపంగా చెప్పాడు.

మరి కొద్ది క్షణాల నిశ్శబ్దం తరవాత "నువ్వు చదువుకోడానికి ఇక్కడికి వస్తానన్నప్పుడు మళ్ళీ అదే గోల మొదలుపెట్టారు. పెదనాన్న నీకు పెళ్ళిచేసి కానీ పంపొద్దన్నాడు. అమెరికాకి వస్తే చెడిపోతారు, వగైరా, వగైరా అదే గోల. అదృష్టవశాత్తూ నాన్న వాళ్ళని పట్టించుకోలేదు. నా పెంపకం మీద నాకు నమ్మకం ఉంది అని తరిమేశారు. అమ్మకి మామూలుగానే భయం. ఒక్కదానివి ఎలా ఉంటావో ఏమో అని దిగులు పడింది. నేనే సర్ది చెప్పి ఒప్పించాను. నువ్వు అమెరికాలో ఉన్నంతవరకూ నా రెస్పాన్సిబిలిటీ. నువ్వు సేఫ్‌గా హేపీగా ఉండేలా చూసుకోవడం నా బాధ్యత. అందుకే కుదిరినప్పుడల్లా నిన్ను సరిచేస్తున్నాను. నేను మొదట్లో వచ్చినప్పుడు పడ్డ కష్టాలు, అలా చెయ్యకపోతే బావుండేదే అనే రిగ్రెట్స్ నీకు లెసన్స్. నువు బాగా చదివి మంచి ఉద్యోగం సంపాదిస్తే నీ మీద అమ్మకున్న నమ్మకాన్ని పోగొట్టేందుకు ప్రయత్నించిన వాళ్ళకి చెప్పుతో కొట్టినట్టుంటుంది" అన్నాడు.

నా గొంతు ఎండిపోయి మాట్లాడలేకపోయాను. అన్నయ్యకి కనబడకుండా కళ్ళు తుడుచుకుని "నాకు ఇవన్నీ తెలియవు" ఏడుపు దిగమింగుతూ అన్నాను.

"అమ్మ నీకు తెలియనివ్వలేదు. నువ్వు బాధపడతావని తెలుసుకాబట్టి. నీకెందుకు చెప్తున్నానంటే నువ్వు చిన్నపిల్లవి కావు. పిన్ని ఏదో అందని, గిన్ని ఏదో అందని మనసు పాడుచేసుకోకు. పైకి అందరూ బాగానే నటిస్తారు. కానీ లోపల కుళ్ళూ కుతంత్రాలు ఉంటాయి. నా దగ్గర, నాన్న దగ్గర ఉన్నప్పటిలాగా కాదు ఇంక, నిన్ను నువ్వే ప్రొటెక్ట్ చేసుకోవాలి. మనుషులతో జాగ్రత్తగా ఉండు. ఎవరినీ నమ్మకు. ఎంతవరకు ఉండాలో అంతవరకే ఉంచు. నీ ఫైనల్ గోల్‌ని ఎప్పుడూ మర్చిపోకు. ఒక్కటి గుర్తుపెట్టుకో, అమ్మకి, నాన్నకి, నాకు నీమీద ఉన్నంత నమ్మకం ప్రేమ ఇంకెవరికీ ఉండదు. అమ్మా వాళ్ళతో పంచుకోలేనివి నాతో షేర్ చేసుకో. తిడతానని భయపడకు. తప్పైతే సరి చేస్తాను"

ఏమీ మాట్లాడలేక పోవడం చూసి, ఏడుపు ఆపుకుంటున్నానని గమనించి, "సరే. ఇంక పడుకుందామా? పొద్దున ఆఫీసుంది మళ్ళీ. దీని గురించి ఏమీ ఆలోచించకుండా ప్రశాంతంగా నిద్రపో. రేపు బుక్స్ చదవడంతోపాటు షాపింగ్‌కి వెళ్ళినప్పుడు ఏం కావాలో లిస్ట్ రాయి" అన్నాడు.

"సరే" అని గబుక్కున లోపలికి వెళ్ళిపోయాను. అన్నయ్య మాటలే నా మెదడులో మెదులుతున్నాయి. నేనంటే నిజంగా ఇంత ప్రేమ ఉందని నేను ఎప్పుడూ అనుకోలేదు. పాపం అమ్మని చుట్టాలు ఎంత ఆడిపోసుకుంటున్నారో అని బాధతో వెక్కి వెక్కి ఏడుస్తూ నిద్రలోకి జారుకున్నాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story